AKSHARA TODAY

# అక్షర టుడే


TOWARDS... TRUTH. TRUST. TREND

www.aksharatoday.in


## ప్రచారాలు, ప్రకటనలపై నిషేధం..

**అక్షరటుడే, ఇందూరు :** ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున జిల్లావ్యాప్తంగా ఎన్నికలకు సంబంధించి ఎలాంటి ప్రకటనలు, సమావేశాలు నిర్వహించరాదని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. ఈ మేరకు మంగళవారం ప్రకటన విడుదల చేశారు. నిబంధనలు అతిక్రమించి ఎవరైనా సమావేశాలు, ప్రకటనలు విడుదల చేసినట్లయితే నిబంధనల ప్రకారం కఠినచర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. పోలింగ్ ప్రక్రియ ముగిసే వరకు ఆంక్షలు అమలులో ఉంటాయన్నారు. ఎన్నికల సందర్భంగా ఎగ్జిట్ పోల్స్‌పై నిషేధం అమలులో ఉందని తెలిపారు. కావున ఎవరు కూడా అభ్యర్థుల గెలుపోవటములపై మాట్లాడవద్దన్నారు. ఎన్నికల నియమ నిబంధనలను ప్రజలతోపాటు అధికారులు సైతం తప్పకుండా పాటించాలని చెప్పారు.


10-2-2026 | NIZAMABAD / KAMAREDDY | PAGES - 2


## ఎన్నికల్లో ఐదంచెల భద్రత: ఎస్పీ

**అక్షరటుడే, కామారెడ్డి:** మున్సిపల్ ఎన్నికల్లో ప్రశాంత వాతావరణంలో జరిగేలా ఐదంచెల భద్రత ఏర్పాటు చేస్తున్నట్లు కామారెడ్డి ఎస్పీ రాజేష్ చంద్ర తెలిపారు. ఈ మేరకు మంగళవారం పోలీస్ సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల పరిధిలో ఎన్నికలను శాంతియుతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు జిల్లా పోలీస్ శాఖ అన్ని భద్రతా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. మొత్తం 92 వార్డుల పరిధిలోని 239 పోలింగ్ కేంద్రాల వద్ద భద్రత కోసం 722 మంది పోలీసులతో ఐదంచెల బందోబస్తును ఏర్పాటు చేసినట్లు వివరించారు. భద్రతా చర్యల్లో భాగంగా ముగ్గురు డీఎస్పీల పర్యవేక్షణలో స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్, 10 మంది సీఐల ఆధ్వర్యంలో స్ట్రైకింగ్ ఫోర్స్ టీమ్స్, 21 రూట్ మొబైల్ పార్టీలతో పాటు ఐదుగురు ఎస్‌హెచ్‌వో పెట్రోలింగ్ బృందాలను నిరంతరం పర్యవేక్షణ కోసం రంగంలోకి దించినట్లు ఆయన వెల్లడించారు. ముఖ్యంగా జిల్లాలో గుర్తించిన 17 మంది క్రిటికల్, 8 మంది సెన్సిటివ్, 8 హైపర్ సెన్సిటివ్ పోలింగ్ కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఎన్నికలు ముగిసే వరకు పోలింగ్ కేంద్రాల పరిసరాల్లో 163 బీఎన్ఎస్ఎస్ అమలులో ఉంటుందని, నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. పోలింగ్ కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు, వాటర్ బాటిళ్లు, ఇతర నిషేధిత వస్తువులను తీసుకురావద్దని, పోలింగ్ బూత్‌లో సెల్ఫీలు దిగడంపై నిషేధం ఉంటుందని స్పష్టం చేశారు. ఓటర్లు ప్రలోభాలకు గురికాకుండా, భయపడకుండా ఓటుహక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలన్నారు. శాంతియుత ఎన్నికల నిర్వహణకు పోలీసులకు సహకరించాలని కోరారు.



## పటిష్టమైన భద్రత ఏర్పాట్లు..: సీపీ సాయిచైతన్య

**అక్షరటుడే, భీమ్‌గల్:** మున్సిపల్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని పోలీస్ కమిషనర్ సాయిచైతన్య అధికారులను ఆదేశించారు. ఫిబ్రవరి 11న జరగనున్న పోలింగ్ నేపథ్యంలో ఆయన మంగళవారం భీమ్‌గల్ లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. పోలింగ్ ముగిసిన తర్వాత బ్యాలెట్ బాక్స్‌లను స్ట్రాంగ్ రూమ్‌కు తరలించే ప్రక్రియ, అనంతరం వాటి భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. స్ట్రాంగ్ రూమ్ వద్ద 24 గంటల పాటు నిఘా ఉంచాలని ఆదేశించారు. కౌంటింగ్ రోజు ఎటువంటి ఉద్రిక్తతలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం వివిధ పోలింగ్ బూత్‌లను పర్యవేక్షించిన సీపీ, బూత్‌ల వద్ద ప్రజలు గుమిగూడకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డి, సీటీసీ ఏసీపీ రాజశేఖర్, భీమ్‌గల్ సీఐ పొన్నం సత్యనారాయణ గౌడ్, మున్సిపల్ కమిషనర్ గోపు గంగాధర్, తహశీల్దార్ మహమ్మద్ షబ్బీర్, ఎంపీడీవో గంగుల సంతోష్ కుమార్, వివిధ మండలాల ఎస్సైలు పాల్గొన్నారు.

పురపోరుకు సర్వం సిద్ధమైంది. ఎంతో కాలంగా ఉత్కంఠగా ఎదురు చూస్తున్న మున్సిపల్ ఎన్నికలు మరి కొన్ని గంటల్లో జరగనున్నాయి. ఎన్నికల కోసం అధికారులు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు చేశారు. పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించారు. సిబ్బందికి ఎలక్షన్ సామగ్రి పంపిణీ చేశారు. బుధవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరగనుంది. ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

- అక్షరటుడే, కామారెడ్డి



- ఏర్పాట్లు పూర్తి చేసిన జిల్లా యంత్రాంగం
- పోలింగ్ సామగ్రి అప్పగింత
- పోలీసుల భారీ బందోబస్తు

# పోలింగ్‌కు సిద్ధం..

ఉమ్మడి జిల్లాలో ఒక కార్పోరేషన్, ఏడు మున్సిపాలిటీలకు ఎన్నికలు జరగనున్నాయి. నగర కార్పోరేషన్లో 60 డివిజన్లు, ఏడు మున్సిపాలిటీలలో 178 వార్డులు ఉన్నాయి. ఆయా వార్డుల్లో ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. ఇప్పటికే పోలింగ్ సిబ్బందికి పలు విడతలుగా శిక్షణ ఇచ్చారు. జిల్లా వ్యాప్తంగా ఎన్నికల కోసం సిబ్బందిని నియమించారు. పోలింగ్ కేంద్రాలను గుర్తించి అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశారు.

### పోలింగ్ సామగ్రి అందజేత

ఎన్నికల నేపథ్యంలో మున్సిపాలిటీ కేంద్రాల్లో అధికారులు డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 8 గంటలకు డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలకు చేరుకున్న జోనల్ ఆఫీసర్లు, పోలింగ్ ఆఫీసర్లు, అసిస్టెంట్ పోలింగ్ ఆఫీసర్లకు బ్యాలెట్ పత్రాలు, బ్యాలెట్ బాక్సులను, ఇతర సామగ్రిని అప్పగించారు. పోలింగ్ కేంద్రాల వారిగా సిబ్బంది కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సులలో సామగ్రిని తరలించారు.



### పోలింగ్ కేంద్రాల వివరాలు

కామారెడ్డి జిల్లాలో 239 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. కామారెడ్డి మున్సిపాలిటీలో 152, ఎల్లారెడ్డిలో 24, బాన్సువాడలో 39, బిచ్కుందలో 24 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. నాలుగు మున్సిపాలిటీల్లో మొత్తం 1,49,525 మంది ఓటర్లు ఉండగా.. అందులో 77,005 మంది మహిళలు, 72,491 మంది పురుషులు, 29 మంది ఇతరులు ఉన్నారు.

### పోలింగ్ సిబ్బంది వివరాలు

నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా మొత్తం 66 మంది రిటర్నింగ్ ఆఫీసర్లను నియమించారు. అలాగే ఏఆర్‌వోలు 66 మంది, ప్రిసైడింగ్ ఆఫీసర్లు 875 మంది విధుల్లో పాల్గొననున్నారు. అంతేకాకుండా ఏపీవోలు 875 మంది, ఓపీవోలు 2,625 మందిని నియమించారు. మొత్తంగా 4,375 మంది పోలింగ్ సిబ్బంది ఎన్నికల విధుల్లో పాల్గొననున్నారు.

### నిజామాబాద్ జిల్లాలో..

నిజామాబాద్ జిల్లాలో ఒక కార్పొరేషన్, మూడు మున్సిపాలిటీలకు కలిపి 146 వార్డులు ఉన్నాయి. జిల్లాలో మొత్తం 729 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. జిల్లాలో మొత్తం 4,95,485 ఓటర్లు ఉండగా 714 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. కార్పొరేషన్‌లో 350 అభ్యర్థులు, భీమ్‌గల్‌లో 49, బోధన్‌లో 162, ఆర్మూర్‌లో 153 అభ్యర్థులు పోటీ చేస్తున్నారు.

### కామారెడ్డి జిల్లాలో

కామారెడ్డి జిల్లాలో 1,398 మంది పోలింగ్ సిబ్బందిని నియమించారు. కామారెడ్డి మున్సిపాలిటీలో 883 మంది, ఎల్లారెడ్డి మున్సిపాలిటీలో 142, బాన్సువాడ మున్సిపాలిటీలో 229 మంది, బిచ్కుంద మున్సిపాలిటీలో 144 మంది సిబ్బందిని నియమించారు. కామారెడ్డిలో 17 మంది రిటర్నింగ్ ఆఫీసర్లు, బాన్సువాడకు ఏడుగురు, బిచ్కుంద, ఎల్లారెడ్డిలకు నలుగురు చొప్పున నియమించారు. జిల్లాలోని 239 పోలింగ్ కేంద్రాలలో సమస్యాత్మకమైన 21 పోలింగ్ కేంద్రాలు, అత్యంత సమస్యాత్మకమైన 68 పోలింగ్ కేంద్రాలుగా గుర్తించారు.

## హత్యాయత్నం కేసులో తల్లీకొడుకులకు ఏడేళ్ల జైలు

**అక్షరటుడే, కామారెడ్డి:** ఓ వ్యక్తిని కులం పేరుతో దూషించి హత్యాయత్నానికి పాల్పడిన తల్లీకొడుకులకు ఏడేళ్ల జైలుశిక్ష పడింది. ఈ మేరకు కామారెడ్డి రెండో అదనపు జిల్లా సెషన్స్ జడ్జి శ్రీనివాస్ మంగళవారం తీర్పు వెలువరించారు. కేసుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. కామారెడ్డి పట్టణంలోని రాజీవ్ నగర్ కాలనీలో నివాసముంటున్న సరంపల్లి విజయ్ కుమార్‌ను 2024 మే 6న బయటకు రావాలని రాత్రి పక్కనే ఉంటున్న తల్లీకొడుకులు పోచారం భాస్కర్, దాకవ్వలు పిలవడంతో విజయ్ బయటకు వచ్చాడు. రాగానే అతన్ని కులంపేరుతో దూషించడంతో పాటు రోకలిబండతో దాడి చేశారు. అడ్డుకున్న విజయ్ భార్యపై కూడా దాడికి పాల్పడ్డారు. ఈ విషయమై విజయ్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో ముంబయి నుంచి వచ్చిన విజయ్ పోచారం భాస్కర్ ఇంటి పక్కనే ఇల్లు కట్టుకుని ఆటో నడుపుకుంటూ జీవిస్తున్నాడని, అతడిని చంపాలని పథకం ప్రకారం దాడికి పాల్పడ్డారని తేలడంతో ఇద్దరిని అరెస్ట్ చేశారు. కేసు దర్యాప్తులో భాగంగా సాక్షాలు సేకరించి కోర్టులో సమర్పించగా ఇద్దరికి ఏడేళ్ల జైలుశిక్ష, రూ.4,500 జరిమానా విధిస్తూ కోర్టు తీర్పునిచ్చింది.

## రైతులకు ఉత్తమ సేవలు అందించాలి



**అక్షరటుడే, పెద్ద కొడప్‌గల్ :** విద్యుత్‌శాఖ అధికారులు రైతులకు ఉత్తమ సేవలు అందించాలని టీజీఎన్పీడీసీఎల్ టెక్నికల్ మెంబర్ రామకృష్ణ అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలోని విద్యుత్ కేంద్రంలో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు సేవలందిస్తున్న సిబ్బందిని అభినందించారు. ప్రజలకు నాణ్యమైన సేవలు అందించినప్పుడే సంస్థ ముందుకు వెళ్తుందన్నారు. వినియోగదారులు సైతం తమ సమస్యలను ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయవచ్చన్నారు. 8 దరఖాస్తులకు గాను నాలుగింటిని సత్వరమే పరిష్కరించామని మిగిలిన వాటిని త్వరలోనే పరిష్కరిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ ఉద్యోగులు, ప్రజలు పాల్గొన్నారు.



## ముప్కాల్ బస్టాండ్‌లో బస్సులు ఆపాలి

**అక్షరటుడే, ముప్కాల్:** ముప్కాల్ బస్టాండ్‌లో గతంలో మాదిరిగానే ఆర్టీసీ బస్సులు ఆపాలని వీడీసీ సభ్యులు కోరారు. ఈ మేరకు మంగళవారం కమిటీ ఆధ్వర్యంలో ఆర్మూర్ ఆర్టీసీ డిపో మేనేజర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ముప్కాల్ మండల కేంద్రంలో బైపాస్ వద్ద బ్రిడ్జి పనులు కొనసాగుతున్న కారణంగా గత కొంతకాలంగా ఆర్టీసీ బస్సులతో పాటు ఇతర వాహనాలకు గాంధీ చౌరస్తా వద్ద నుంచి డైవర్ట్ చేశారన్నారు. ఇటీవల బ్రిడ్జి వద్ద ఒకవైపు రహదారిని పునరుద్ధరించినప్పటికీ ఆర్టీసీ బస్సులు మాత్రం గాంధీ చౌరస్తా వద్ద ఆగకుండా బస్టాండ్‌ను దాటుకుని వెళ్తున్నాయన్నారు. దీంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ఎప్పటిలాగే బస్సులు నడపాలని వారు కోరారు. దీనిపై డిపో మేనేజర్ సానుకూలంగా స్పందించారని గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. కార్య క్రమంలో వీడీసీ సభ్యులు గడ్డం సంతోష్, ముస్కు నర్సయ్య, చిన్న బాలరాజ్, కుమ్మరి భూమన్న, కమ్మరి ఆనంద్ పాల్గొన్నారు.

## పగిలిన మిషన్ భగీరథ పైప్‌లైన్



బాన్సువాడ మండలం సోమేశ్వర్ గ్రామ పరిధిలో జాతీయ రహదారి నిర్మాణ పనులు కొనసాగుతుండగా.. మిషన్ భగీరథ తాగునీటి పైప్‌లైన్ పగిలి భారీగా నీరు వృథాగా పోతోంది. దీంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా బైక్‌లపై వెళ్లే ప్రయాణికులు జారిపడే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా తాగునీరు ఇలా వృథాగా పోవడం పట్ల గ్రామ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్థానికులు సంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చినప్పటికీ మరమ్మతు పనులు చేపట్టలేదని ఆరోపిస్తున్నారు. వెంటనే స్పందించి పైప్‌లైన్‌కు మరమ్మతు చేసి నీటి వృథాను ఆపాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

– అక్షరటుడే, బాన్సువాడ

## ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలి: కలెక్టర్

**అక్షరటుడే, ఇందూరు:** మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్‌లో సీపీ సాయిచైతన్యతో కలిసి మీడియాతో సమావేశం నిర్వహించారు. జిల్లాలోని ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఈనెల 11న ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని నిజామాబాద్ నగర పాలక సంస్థతో పాటు బోధన్, ఆర్మూర్, భీమ్‌గల్ మున్సిపాలిటీల్లో ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌క్యాస్టింగ్ ఏర్పాటు చేయించామని, ఎన్నికల ప్రక్రియను నిశితంగా పరిశీలన జరిపేందుకు వీలుగా 73 మంది మైక్రో అబ్జర్వర్లను, 47మంది జోనల్ అధికారులను నియమించామని కలెక్టర్ తెలిపారు. ఆయా మున్సిపాలిటీల పరిధిలో ఇప్పటికే 88 శాతం ఓటింగ్ స్లిప్‌ల పంపిణీ పూర్తయ్యిందని కలెక్టర్ తెలిపారు. 18 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒకదానిని చూపి ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవచ్చని సూచించారు. అయితే, పోలింగ్ కేంద్రాలలోకి సెల్‌ఫోన్, ఇతర ఎలక్ట్రానిక్ ఉపకరణాలు, ద్రవ పదార్థాలను పూర్తిగా నిషేధించడం జరిగిందన్నారు. ఈనెల 13న ఓట్ల లెక్కింపు జరిపి అదేరోజు ఫలితాలను వెల్లడించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. 16న మేయర్, డిప్యూటీ మేయర్, ఛైర్ పర్సన్, వైస్ ఛైర్‌పర్సన్ ఎన్నిక కోసం



ఉదయం 11 గంటలకు సంబంధిత మున్సిపాలిటీలలో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తారని తెలిపారు.సీపీ సాయిచైతన్య మాట్లాడుతూ.. ఏడుగురు ఏసీపీలు, 70 మంది సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, మరో 70 మంది సబ్ ఇన్‌స్పెక్టర్లు సహా 1,370 మంది పోలీసులు బందోబస్తులో పాల్గొంటున్నారన్నారు. ప్రత్యేకంగా మూడు ప్లాటూన్ల పోలీసు బలగాలు జిల్లాకు చేరుకున్నాయని తెలిపారు. ఎక్కడ ఎలాంటి సంఘటన జరిగినా తక్షణమే స్పందించేందుకు వీలుగా స్ట్రైకింగ్ ఫోర్సు, క్విక్ రియాక్షన్ టీం బృందాలు ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్ పాల్గొన్నారు.

## ఎన్నికల్లో డబ్బు పంపిణీని అరికట్టాలి..



**అక్షరటుడే, కామారెడ్డి**: బిచ్కుంద మున్సిపాలిటీలో జరుగుతున్న ఎన్నికల్లో ఓటర్లను మభ్య పెట్టేందుకు డబ్బు, మద్యం పంచుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ ఉద్యమకారుల అభివృద్ధి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సంజీవులు అన్నారు. ఈ మేరకు కామారెడ్డి కలెక్టర్, ఎస్పీకి బుధవారం లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బిచ్కుంద పట్టణంలో సోమవారం సాయంత్రం ఎన్నికల ప్రచారం ముగిసిన తర్వాత స్థానిక ఎమ్మెల్యే ఓ ఇంట్లోకి ప్రవేశించి డబ్బులను ఓటర్లకు పంపిణీ చేశారని ఆరోపించారు. ఓటర్లకు మద్యం, మటన్, చికెన్ భారీ స్థాయిలో పంపిణీ చేయడం జరిగిందని సంజీవులు పేర్కొన్నారు. వీటిని పంపిణీ చేసేటప్పుడు స్థానికులు పట్టుకోవడం జరిగిందన్నారు. ఇలా ఓటర్లకు మద్యం, డబ్బులు, మాంసం పంపిణీ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఓటర్లను మభ్యపెడుతున్నట్లు స్థానిక అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని ఆరోపించారు. వెంటనే అధికారులు స్పందించి బిచ్కుందలో ప్రత్యేక అధికారిని నియమించాలని కోరారు. ఎన్నికల చట్టాన్ని ఉల్లగించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## ఘనంగా ఎమ్మెల్యే పోచారం జన్మదిన వేడుక



**అక్షరటుడే, బాన్సువాడ**: రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి జన్మదినం నిర్వహించారు. ఈ మేరకు బాన్సువాడలోని నివాసంలో మంగళవారం కుటుంబ సభ్యులు, పట్టణ నాయకులు, అభిమానుల సమక్షంలో ఆయన కట్ చేశారు. పోచారం సతీమణి పుష్ప సోదరుడు పోచారం శంభు రెడ్డి, రాష్ట్ర అగ్రోస్ ఇండస్ట్రీస్ ఛైర్మన్ కాసుల బాలరాజు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ డీసీసీబీ ఛైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి, పోచారం సురేందర్ రెడ్డి, బాన్సువాడ పట్టణ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

### కోటగిరిలో..



**అక్షరటుడే, కోటగిరి**: కొత్తపల్లిలో ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో ప్రైమరీ, విద్యార్థులకు అంగన్‌వాడీ పిల్లలకు, పలకలు, పెన్నులు, పండ్లు అందజేశారు.ఈ సందర్భంగా ఏఎంసీ ఛైర్మన్ గైక్వాడ్ హన్మంత్ మాట్లాడుతూ.. పోచారం శ్రీనివాస్ రెడ్డి ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు జీవించాలని వేడుకున్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ నబి, సీనియర్ నాయకులు, గంధపు పవన్, కేశ వీరేశం, ఎజాజ్ ఖాన్, వర్ని శంకర్ పాల్గొన్నారు.

అది ఒక మారుమూల గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల. ఆడుకోవడానికి విశాలమైన మైదానం లేదు.. అత్యాధునిక వసతులు లేవు. కానీ.. ఆ విద్యార్థుల్లో క్రీడల్లో పాల్గొనాలని.. గెలవాలనే పట్టుదల ఉంది. వ్యాయామ ఉపాధ్యాయుడి ప్రోత్సాహం తోడైంది. వెరసి.. బడా భీమ్‌గల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడాకారులు ఇప్పుడు జాతీయ స్థాయి వేదికలపై తెలంగాణ పేరు నిలబెడుతున్నారు. వాలీబాల్, టెన్నికాయిట్ క్రీడల్లో పతకాలు సాధిస్తూ బడాభీమ్‌గల్‌కు ప్రత్యేకత తెస్తున్నారు.

– అక్షరటుడే, భీమ్‌గల్



# మట్టిలో మాణిక్యాలు..
# బడాభీమ్‌గల్ క్రీడాకారులు

■ జాతీయస్థాయిలో ప్రతిభ చూపుతున్న ప్లేయర్లు ■ టెన్నికాయిట్, వాలీబాల్‌లో పతకాల పంట ■ పీఈటీ ప్రోత్సాహంతో ముందుకు..



జమ్మూ కశ్మీర్‌లో ఇటీవల జరిగిన జాతీయస్థాయి సబ్ జూనియర్ టెన్నికాయిట్ పోటీల్లో ఈ.ప్రవస్తి, ఎన్.ఆనందిత తెలంగాణ తరపున ప్రాతినిథ్యం వహించి సత్తా చాటారు. అంతకుముందు ఆర్మూర్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ఆనందిత ద్వితీయ, ప్రవస్తి తృతీయ స్థానాలు సాధించి జాతీయ స్థాయికి ఎంపికయ్యారు.

### చెన్నై వేదికగా..

ఈ ఏడాది చెన్నైలో జరిగిన జాతీయ జూనియర్ టెన్నికాయిట్ ఛాంపియన్‌షిప్‌లో పి.కీర్తి సుధ పాల్గొని తన ప్రతిభను చాటారు. వీరితో పాటు ఉస్మాన్, అభినయ్, హర్షిణి కూడా రాష్ట్ర స్థాయిలో మెరిశారు.

### వాలీబాల్‌లో వరుస విజయాలు

వాలీబాల్ విభాగంలోనూ ఈ పాఠశాల విద్యార్థులు తిరుగులేని ప్రదర్శన కనబరుస్తున్నారు. ఖమ్మంలో జరిగిన రాష్ట్ర స్థాయి సీఎం కప్ టోర్నమెంట్‌లో నిజామాబాద్ జిల్లా జట్టు ప్రథమ స్థానంలో నిలవడంలో పాఠశాల విద్యార్థిని డి.విజ్ఞ కీలక పాత్ర పోషించింది. అలాగే మహబూబ్‌నగర్‌లో జరిగిన అండర్ 17 రాష్ట్రస్థాయి పోటీల్లోనూ మెరిసింది. అలాగే అండర్ 14లో ఎం.వైశాలి, ఓ.శ్రీనిత్, అండర్ 16లో ఎం. అనన్య రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై పాఠశాల గౌరవాన్ని పెంచారు.

### శిక్షణే ఆయుధంగా..

పాఠశాలలో సరైన గ్రౌండ్ లేకపోయినప్పటికీ, వ్యాయామ ఉపాధ్యాయుడు ఈర్ల భూపతి అందుబాటులో ఉన్న కొద్దిపాటి స్థలంలోనే విద్యార్థులకు మెరుగైన శిక్షణ ఇస్తున్నారు. గ్రామీణ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి, వారికి క్రీడా మెలకువలు నేర్పుతుండటంతో విద్యార్థులు వరుస విజయాలు సాధిస్తున్నారు.

### ప్రోత్సహిస్తే.. ఆకాశమే హద్దుగా..

జాతీయ స్థాయికి ఎదిగిన క్రీడాకారులను హెచ్‌ఎం కృష్ణస్వామి, సర్పంచ్ రాచకొండ విష్ణువర్ధని శంకర్ గౌడ్, వీడీసీ అధ్యక్షుడు మోర్తాడ్ లింబాద్రి, గ్రామస్థులు ఘనంగా సన్మానించారు. గ్రామీణ ప్రాంత క్రీడాకారులకు ప్రభుత్వం మరింత మెరుగైన వసతులు, మైదానం కల్పిస్తే వారు అంతర్జాతీయస్థాయిలో రాణిస్తారని క్రీడాభిమానులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.





## సేవాలాల్ జయంతి రోజు సెలవు ప్రకటించాలి



**అక్షరటుడే, పెద్దకొడప్‌గల్**: బంజారాల ఆరాధ్య దైవమైన సంత్ సద్గురు సేవాలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా ఫిబ్రవరి 15న ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలని ఆల్ ఇండియా బంజారా సేవ సంఘ్ మండల అధ్యక్షుడు రాథోడ్ విజయ్ కోరారు. ఈ మేరకు మంగళవారం తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సేవాలాల్ జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తోందన్నారు. కాని ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు ప్రకటించలేదన్నారు. ప్రభుత్వం ఈ అంశంపై దృష్టిపెట్టి ఆరోజు సెలవు ప్రకటించాలని డిమాండ్ చేశారు.



## ఫేక్ నంబర్ ప్లేట్‌తో బైక్ డ్రైవింగ్.. ఒకరిపై కేసు


**అక్షరటుడే, బాల్కొండ** : ఫేక్ నంబర్ ప్లేట్ అమర్చుకుని బైక్ నడుపుతున్న వ్యక్తిపై కేసు నమోదైంది. ఈ మేరకు బాల్కొండ ఎస్సై శైలేందర్ సమాచారం అందజేశారు. బాల్కొండ గ్రామానికి చెందిన తౌటు రాజు అనేవ్యక్తి ట్రాఫిక్ చలాన్లు తప్పించుకోవాలనే ఉద్దేశంతో తన బైక్‌కు ఫేక్ నంబర్ ప్లేట్ అమర్చాడు. ఈ క్రమంలో వాహనాల తనిఖీల సమయంలో పోలీసులకు అనుమానం రావడంతో బైక్‌ను పరిశీలించారు. బైక్‌కు అమర్చిన నంబర్ ప్లేట్ నకిలీదని గుర్తించారు. ప్రాథమిక విచారణలో ట్రాఫిక్ చలాన్లు పడకుండా ఉండడానికే ఉద్దేశపూర్వకంగా ఫేక్ నంబర్ ప్లేట్ వినియోగిస్తున్నట్లు పోలీసులు నిర్ధారించారు. ఫేక్ నంబర్ ప్లేట్ వాడడం చట్టవిరుద్ధమైన నేరం కావడంతో అతడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు బాల్కొండ ఎస్సై శైలేందర్ తెలిపారు.

## చోరీ కేసులో దంపతుల అరెస్ట్

**అక్షరటుడే, కామారెడ్డి**: తాళం వేసిన ఇంట్లో పట్టపగలు చోరీకి పాల్పడిన దంపతులను సదాశివనగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు మంగళవారం వివరాలు వెల్లడించారు. ఈ నెల 5 న పద్మాజీవాడి ఎక్స్ రోడ్ కు చెందిన యాళ్ల సురేష్ రెడ్డి ఇంటికి తాళం వేసి పొలం పనులకు భార్యతో కలిసి వెళ్లారు. సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చేసరికి గుర్తు తెలియని వ్యక్తులు తాళాలు పగలగొట్టి ఇంట్లోకి ప్రవేశించి మూడు పట్ట గొలుసుల జతలు, రూ.15 వేల నగదు, రెండు గ్రాముల బంగారు దుద్దులు దొంగిలించినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితులు బాలె నర్సింలు, బొల్లిపల్లి రేణుక కలిసి ఇంటి తాళం పగులగొట్టి దోపిడీకి పాల్పడినట్లు గుర్తించారు. నిందితులను మల్లన్నగుట్ట వద్ద పట్టుకొని వారి వద్ద నుంచి ఆటో, మొబైల్ ఫోన్, వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై పుష్పరాజ్ తెలిపారు.

# పోలింగ్‌కు ఏర్పాట్లు







భీమ్‌గల్‌లో..



ఉమ్మడి జిల్లాలో మున్సిపల్ ఎన్నికల్లో ప్రధాన ఘట్టమైన పోలింగ్‌కు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల నుంచి ఎన్నికల సామగ్రితో ఎన్నికల సిబ్బంది ఆయా పోలింగ్ సెంటర్లకు చేరుకున్నారు. ఉన్నతాధికారుల సూచనల సలహాల మేరకు ఏర్పాట్లు చేస్తున్నారు.

– అక్షరటుడే, నెట్‌వర్క్



ఎల్లారెడ్డిలో..



నిజామాబాద్‌లో



## అయ్యప్ప ఆలయ నిర్మాణానికి విరాళం



**అక్షరటుడే, లింగంపేట**: మండల కేంద్రంలో ఉత్తర శబరిమల అయ్యప్ప ఆలయ నిర్మాణానికి మంగళవారం మండల కేంద్రానికి చెందిన వంజరి రుకుంబాయి ఎల్లమయ్య దంపతులు రూ. 2,11,118 అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త రవి గౌడ్ మాట్లాడుతూ.. ఆలయ నిర్మాణానికి విరాళ అందజేసిన ఎల్లమయ్యకు ఆలయంలో శాశ్వత సభ్యత్వం ఉంటుందని తెలిపారు. అనంతరం దాతలకు శాలువా కప్పి సన్మానం చేశారు. కార్యక్రమంలో స్వాములు చంద్రమౌళి, శ్రీకాంత్, రాజిరెడ్డి, అరుణ్, గౌతమ్, వినోద్, సందీప్, సేవ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

## మోతె గ్రామానికి బస్సు ట్రిప్‌లను పెంచాలి



**అక్షరటుడే, లింగంపేట**: మండలంలోని మోతె, గాంధారి మండలం వండ్రికల్, గుర్జాల్ గ్రామాలకు కామారెడ్డి నుంచి బస్ ట్రిప్పులను పెంచాలని గ్రామస్థులు కోరారు. ఈ మేరకు మంగళవారం డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ.. గ్రామానికి వచ్చే బస్సు అదనంగా వేములవాడకు వేయడంతో మోతే, వండ్రికల్ గ్రామాల ప్రజలు బస్‌ట్రిప్ లేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కార్యక్రమంలో గుర్జాల్ సర్పంచ్ గంగారం, అశోక్ రావు, రాజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## శీనునాయక్ డెంటల్ ఆస్పత్రి ఆధ్వర్యంలో వైద్య శిబిరం



**అక్షరటుడే ఇందూరు**: నగరంలోని శీను నాయక్ డెంటల్ ఆస్పత్రిలో ఆధ్వర్యంలో కల్లెడ జిల్లా పరిషత్ పాఠశాలలో ఉచిత దంత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. దంత వైద్యుడు ముఖేష్ ఆధ్వర్యంలో సుమారు 200 మంది విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించారు. అనంతరం వారికి దంత సంరక్షణపై అవగాహన కల్పించారు. దంతాలలో ఎలాంటి సమస్య ఉన్న వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు టూత్ పేస్టులు, కిట్లు అందజేశారు. కార్యక్రమంలో కల్లెడ జిల్లా పరిషత్ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## హంగర్గలో హరినామ సప్తాహం ప్రారంభం



**అక్షరటుడే, కోటగిరి**: పోతంగల్ మండలం హంగర్గ బీసీ కాలనీ గుట్ట హనుమాన్ మందిరం వద్ద అఖండ హరినామ సప్తాహం ప్రారంభమైనట్లు సర్పంచ్ ఉదయ్ భాస్కర్ తెలిపారు. గ్రామస్థుల ఆధ్వర్యంలో ఏడు రోజులపాటు సప్తాహం నిర్వహించబడుతుంద న్నారు. ప్రతిరోజు ప్రత్యేక పూజ కార్యక్రమాలు, మహారాష్ట్ర చుట్టుపక్క గ్రామా ల వార్కారీలతో భజన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నిత్యం ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, సాయంత్రం భోజనం ఉంటుందని తెలిపారు.